సాక్షి అనంతపురం

శనివారం : 13 : మే : 2023



టన్ను చీనీ రూ.37 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.37 వేలు పలికాయి.



చిన్నారి మురిసేలా చికిత్స

అనంతపురం సర్వజనాస్పత్రిలో చిన్నారులకు మెరుగైన వైద్యం అందుతోంది. డాక్టర్లు, సిబ్బంది అంకితభావంతో సేవలందిస్తున్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం

40.6°/45.5°

జిల్లా అంతటా శుక్రవారం వగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత పెరిగింది. వేసవితాపం అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

పార్టీ బలోపేతానికి కృషి

అనంతపురం క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా నాయకులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి నియోజకవర్గం నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో కన్పించిన చిన్నపాటి సమస్యలను సైతం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు పలు మండలాల్లో 4.8 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 36.6 మి.మీ, బెళుగుప్ప 32, కణేకల్లు 29.4, శెట్టూరు 15.4, బ్రహ్మసముద్రం 10.2 మి.మీతో పాటు గుమ్మఘట్ట, యాడికి, గుంతకల్లు, రాయదుర్గం, ఉరవకొండ మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మే నెల సాధారణ వర్షపాతం 36.7 మి.మీ కాగా ఇప్పటికే 66 మి.మీ మేర వర్షం కురిసింది. రాగల నాలుగు రోజులు జిల్లాకు వర్షసూచన లేదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రైఫ్రూట్స్ అలంకరణలో నెట్టికంటుడు




గుంతకల్లు రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాల్లో మూడో రోజు శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి డ్రైఫ్రూట్స్ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8.30 నుంచి ఆలయ ముఖ మండప ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి సింధూరంతో లక్షార్చన పూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దూరవిద్య పీజీ, యూజీ పరీక్షలు వాయిదా



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న దూరవిద్య పీజీ, యూజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా పడ్డ పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

ఆరుగురు ఎస్‌ఐలకు తాత్కాలిక బదిలీ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పరిపాలనా సౌలభ్యంలో భాగంగా జిల్లాలో ఆరుగురు ఎస్‌ఐలను తాత్కాలికంగా బదిలీ చేస్తూ ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పెద్దవడుగూరు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డిని నార్పలకు, శింగనమల ఎస్‌ఐ డి.శ్రీనివాసులును పెద్దవడుగూరుకు, వీఆర్‌లో ఉన్న ఎ.బాలకృష్ణయ్యను శింగనమలకు, స్పెషల్ బ్రాంచ్‌లోని రుషీంద్రబాబును ఇటుకలపల్లికి, అక్కడి ఎస్‌ఐ శ్రీకాంత్‌ను ఎస్‌బీకి, రాయదుర్గం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ వై.సుమన్‌ను అనంతపురం డీటీఆర్‌బీకి బదిలీ చేశారు.

చిన్న పరిశ్రమల దూకుడు



రాప్తాడులో అట్టపెట్టెలు తయారు చేసే పరిశ్రమ

అనంతపురం జిల్లాలో 2022-23 సంవత్సరంలో పరిశ్రమల తీరు ఇలా	
ఎంఎస్‌ఎంఈల స్థాపన	4,225
వీటిద్వారా వచ్చిన పెట్టుబడులు	రూ.322.64 కోట్లు
ఉద్యోగావకాశాల కల్పన	13,206
ఎంఎస్‌ఎంఈలకు రాయితీ	రూ.28.6 కోట్లు
సింగిల్ డెస్క్ పాలసీ దరఖాస్తులు	426
ఇప్పటివరకూ మంజూరైనవి	397

- సింగిల్ డెస్క్ పాలసీ కీలకభూమిక
- ఒకే ఏడాదిలో రూ.322 కోట్ల పెట్టుబడులు
- నాలుగు వేలకు పైగా ఎంఎస్‌ఎంఈల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పరిశ్రమలు పెరిగితే ఉద్యోగాలు వస్తాయి. పదిమందికి ఉపాధి లభిస్తుంది. దీనివల్ల వేలాది కుటుంబాలకు ఆర్థికంగా వెసులుబాటు దొరుకుతుంది. తమ పిల్లలను ఎవరిమీదా ఆధారపడకుండా ఉన్నతచదువులు చదివించుకుంటారు. ఇలాంటి పరిస్థితులే ఇప్పుడు అనంతపురం జిల్లాలో కనిపిస్తున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) ఏర్పాటులో స్పీడు పెరిగింది. సరళీకృత పారిశ్రామిక విధానం అందుబాటులో ఉండటం, బ్యాంకుల నుంచి రాయితీలు సులభంగా వస్తుండటం తదితర కారణాల చేత ఇప్పుడు ఎంఎస్‌ఎంఈల దూకుడు అమాంతంగా పెరిగింది.

4,225 ఎంఎస్‌ఎంఈలు

జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 4,225 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లు ఏర్పాటయ్యాయి. వీటికోసం రూ.322.64 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. తాజా అంచనాల ప్రకారం జిల్లాలో ఎంఎస్‌ఎంఈల ద్వారా సుమారు 13,206 మందికి ఉద్యోగాలు లభించినట్టు అధికారులు వెల్లడించారు. రానున్న రెండేళ్లలో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

సులువుగా అనుమతులు

గతంలో చిన్న పరిశ్రమను స్థాపించాలన్నా చాలా ఇబ్బందులుండేవి. వివిధ విభాగాల నుంచి రకరకాల అనుమతుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. దీంతో చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు అత్యంత సులభమైన ప్రక్రియ అంటే సింగిల్ డెస్క్ పాలసీ. పరిశ్రమల శాఖ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే చాలు.. ప్రభుత్వ స్థలం, బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ రాయితీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉన్న స్కీముల ద్వారా లబ్ధి ఇవన్నీ ఒక్కచోట నుంచే వస్తాయి. సింగిల్ డెస్క్ ద్వారా 397 యూనిట్లు మంజూరు కాగా.. 318 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఈ విధానం వల్ల కర్ణాటక ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్తలు కూడా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పరిశ్రమలు పెడుతున్నారు. పైగా ఇప్పుడు జిల్లాలో పుష్కలంగా నీళ్లు ఉండటంతో మరింత వెసులుబాటు లభిస్తోంది. అంతేకాదు రకరకాల పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు 'విశాఖ సమ్మిట్' అనంతరం కొత్త పారిశ్రామిక పాలసీని ప్రకటించారు. దీంతో మరింతమంది పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

నెలకు రూ.2 లక్షలకు పైగా టర్నోవర్



ఏడాది క్రితం చిరుధాన్యాలకు సంబంధించిన యూనిట్‌ను రూ.9 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేశాను. ప్రస్తుతం ఈ పరిశ్రమలో చిరుధాన్యాల మిశ్రమాలను తయారు చేసి ఎగుమతులు చేస్తున్నాం. రాయలసీమ జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు చిరుధాన్యాల పౌడర్లను పంపుతున్నాం. నెలకు రూ.2 లక్షలకు పైగా టర్నోవర్ జరుగుతోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లు నెలకొల్పేందుకు ప్రభుత్వం మంచి సహకారం అందిస్తోంది.

– రాజేశ్వరి, ప్రాణి మిల్లెట్ హౌస్, గార్లదిన్నె

సన్‌రూఫ్ షీట్ల పరిశ్రమ పెట్టా..



జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఒప్పందంతో రూ.కోటి వెచ్చించి సన్ రూఫ్ షీట్ల తయారీ పరిశ్రమను నెలకొల్పాం. ఎంఎస్‌ఎంఈలో భాగంగా పరిశ్రమల శాఖ కార్యాలయంలో యూనిట్ నమోదు చేసుకున్నాం. ప్రస్తుతం జేఎస్‌డబ్ల్యూ చేయూతతో సన్ రూఫ్ షీట్లను తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నాం. మా యూనిట్‌లో 15 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాం.

– దినేష్, ఎ.కొండాపురం, తాడిపత్రి మండలం

పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు



గడిచిన నాలుగేళ్లలో ఎంఎస్‌ఎంఈల యూనిట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు రూ.120 కోట్ల మేర ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించింది. వాటితో పాటు యూనిట్లను నెలకొల్పిన పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు అందించింది. చిన్న పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయి.

– నాగరాజరావు, జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ

అందుబాటులో నూతన వంగడాలు

బుక్కరాయసముద్రం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ రకాల పంటల నూతన వంగడాలను విడుదల చేసింది. అందులో భాగంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా సాగు చేసేందుకు కొత్త రకం వేరుశనగ, కంది, సజ్జ నూతన వంగడాలను రేకులకుంటలోని పరిశోధనా స్థానంలో రైతులకు అందుబాటులో ఉంచారు. నూతన వంగడాల వివరాలు, ధరలను పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి వెల్లడించారు. వేరుశనగ కే-6 (ప్రయోజన కారిణి విత్తనం) కిలో రూ.170, కే-6 (సత్య ప్రమాణ పూర్వక చీటీ గల విత్తనం) రూ.120, విశిష్ట జీసీజీఎస్-1694 ప్రయోజన కారిణి విత్తనం కిలో రూ.170, టీసీజీఎం-1694 సత్య ప్రమాణ పూర్వక చీటీ గల విత్తనం రూ.120, కంది పీఆర్‌జీ-176 (పునాది విత్తనం) రూ.120, సజ్జ ఏబీవీ-04 (సత్య ప్రమాణ పూర్వక చీటీ గల విత్తనం) కిలో రూ.70గా ధర నిర్ణయించామని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 94910 90978, 94416 52784, 85559 42733 నంబర్లలో సంప్రదించాలన్నారు.

16న జాబ్‌మేళా

అనంతపురం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9 గంటలకు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కియా ఇండియాలో నీమ్ ట్రైనీ ఉద్యోగానికి డిప్లొమో పూర్తి చేసిన వారు అర్హులని, నెలకు రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఇస్తారని పేర్కొన్నారు. రిలయన్స్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, నెలకు రూ.10 వేల జీతం ఇస్తారని తెలిపారు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో ఉద్యోగానికి ఇంటర్మీడియెట్ (కన్నడ, హిందీ, ఇంగ్లిష్, తమిళ్ మీడియం) చదివిన వారు అర్హులన్నారు. యంగ్ ఇండియా కంపెనీలో ట్రైనీ మేనేజర్ ఉద్యోగానికి నెలకు రూ.15 వేలు జీతం ఇస్తారని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటాతో పాటు ఆధార్, విద్యార్హత పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: జూన్ నుంచి ప్రారంభమయ్యే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ, వైద్యశాఖ అధికారులతో జిల్లాస్థాయి కీటక జనిత వ్యాధుల నివారణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో నిలిచిన మురికి నీరు, పాత టైర్లు, నీటి సంప్‌లు, పడేసిన డబ్బాలు, నిల్వ ఉండే వాటిలో డెంగీ కారకాలైన దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మునిసిపల్, పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

డెంగీ లక్షణాలు కనిపించే గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా గ్రామాల్లో పర్యటించే వైద్యులు, సిబ్బంది డెంగీ కారకాలైన దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు అవగాహన కల్పించే బాధ్యతను డీఆర్‌డీఏ, మహిళా శిశు సంక్షేమ శాఖలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియలో గనులు, పరిశ్రమలు, మత్స్య శాఖలు భాగస్వామ్యం అవ్వాలని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యా, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి, డీపీఓ ప్రభాకర్‌రావు, నగర పాలక కమిషనర్ రమణారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాలు విజయవంతం చేయండి

నగర, పురపాలక సంఘాల్లో జగనన్న స్వచ్ఛ సంకల్పం- క్లీన్ ఆంధ్రప్రదేశ్, ఇళ్ల నిర్మాణాలు, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, శాశ్వత భూ హక్కు వంటి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిషనర్లకు కలెక్టర్ సూచించారు. మునిసిపాలిటీల్లో పన్నుల ద్వారా ఆదాయం పెరగాలంటే ప్రజలు ఆశించిన స్థాయిలో నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన ఉండాలని ఆదేశించారు.

'నిషేధితం' నుంచి 45,716 ఎకరాలకు విముక్తి



సీఎం పంపిన పత్రాన్ని జేసీ కేతన్‌గార్గ్ చేతుల మీదుగా అందుకుంటున్న నరసింహులు

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఏడాది కాలంలో నిషేధిత భూముల జాబితా నుంచి 12,141 సర్వే నంబర్లలోని 45,716 ఎకరాలను తొలగించినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ స్పష్టం చేశారు. చుక్కల భూములకు పరిష్కారం చూపుతూ అర్హత కలిగిన భూములను నిషేధిత భూముల (22ఏ) జాబితా నుంచి తొలగించి లబ్ధిదారులకు పత్రం అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నెల్లూరు జిల్లా కావలిలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, రెవెన్యూ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. శెట్టూరు మండలం కమతాన హళ్లి రైతు ఆర్.నరసింహులుకు చెందిన సర్వే నంబర్ 27-1ఏలో ఉన్న 5.30 ఎకరాలను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించారు. ఇందుకు సంబంధించి సీఎం పంపిన పత్రాన్ని జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా నరసింహులు అందుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 22ఏ(1)(ఈ) నుంచి తొలగించాల్సిన భూములను తొలగిస్తూ, అదేవిధంగా 22ఏ(1)(ఏ)(బీ)(డీ)లలో ఉండాల్సిన భూములను ఆయా జాబితాలోకి చేర్చేందుకు రిజిస్ట్రేషన్ శాఖకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇందులో 1,102 సర్వే నంబర్లలోని 3,860.96 ఎకరాలు 22ఏ(1)(ఈ) నుంచి 22ఏ(1)(ఏ)లోకి బదిలీ చేశామన్నారు. 81 సర్వే నంబర్లలోని 301.06 ఎకరాలు 22ఏ(1)(ఈ) నుంచి 22ఏ(1)(బీ)లోకి బదిలీ చేశామన్నారు. 8 సర్వే నంబర్లలోని 26.99 ఎకరాలను 22ఏ(1)(ఈ) నుంచి 22ఏ(1)(డీ)లోకి బదిలీ చేశామన్నారు. 3,534 సర్వే నంబర్లలోని 12,268 ఎకరాలను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించామన్నారు. వీటితో కలుపుకుని ఏడాది కాలంలో 22 ఏ(1)(ఏ)(బీ)(డీ)(ఈ) జాబితా నుంచి మొత్తం 12,141 సర్వే నంబర్లలోని 45,716 ఎకరాలను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించామని వివరించారు.

భూముల రిజిస్ట్రేషన్‌లో అసౌకర్యం కలగకూడదు

నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకూడదని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో నిషేధిత భూముల జాబితా (22ఏ)పై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన జీవో 59 మేరకు నిషేధిత భూములను తొలగించామన్నారు. సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణం, తదితర వివరాలను ఇప్పటికే ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కలెక్టరేట్ నుంచి పంపించామన్నారు. సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం, ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ హరికుమార్, డీటీలు హరి, ప్రభంజన్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి



మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ వి.రామిరెడ్డి

గుమ్మఘట్ట: గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ వి.రామిరెడ్డి వైద్య ఆరోగ్యసిబ్బందికి సూచించారు. బేలోడు బీసీ కాలనీలో వాంతులు, విరేచనాలతో కొంతమంది అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న రాష్ట్ర డైరెక్టర్ శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి గ్రామస్తులతో మాట్లాడారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. 34 మంది బాధితుల్లో 9 మంది డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారు ప్రభుత్వాస్పత్రుల్లో కోలుకుంటున్నారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన మలేరియా సబ్‌యూనిట్ అధికారి తిరుపాల్‌నాయక్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఎంహెచ్‌ఓ వీరబ్బాయిని ఆదేశించారు. అంతకుముందు రాష్ట్ర ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ వేణు డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన బాధితులతో మాట్లాడారు. అనంతరం రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కర్నూలు రీజినల్ పబ్లిక్ హెల్త్ ల్యాబరేటరీ సిబ్బంది నీటి శ్యాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, సర్పంచ్ కోట్ల ఉమేష్, డెమో అధికారి భారతి, వైద్యులు బాలాజీనాయక్, రాంకిషోర్, సీహెచ్‌ఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

'టిడ్కో' లబ్ధిదారుల సమస్యకు పరిష్కారం

- మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో ఎమ్మెల్యే అనంత, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

అనంతపురం క్రైం: డబ్బు చెల్లించినా టిడ్కో ఇళ్లు కేటాయింపు కాని లబ్ధిదారుల సమస్యకు పరిష్కారం చూపనున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. శుక్రవారం అనంతపురంలోని అహుడా కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌తో కలసి పబ్లిక్ హెల్త్, టిడ్కో, అహుడా, మునిసిపల్ అధికారులతో మంత్రి వివిధ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో టిడ్కో ఇళ్లు దక్కని 7,930 మంది లబ్ధిదారులకు రూ.14.36 కోట్లు రావాల్సి ఉందని తెలపగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. జిల్లాలో ఇలాంటి వారు ఎంతమంది ఉంటారని మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, టిడ్కో అధికారి రాజశేఖర్‌ను ప్రశ్నించారు. 1,60,272 మంది ఉన్నారని, వారికి రూ.33 కోట్ల వరకు డబ్బు వాపస్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. లబ్ధిదారుల జాబితాతో కలెక్టర్ ద్వారా నివేదికను ప్రభుత్వానికి పంపితే.. పరిశీలించి డబ్బు వాపస్‌కు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. నీటి సరఫరాకు సంబంధించి గుత్తిలో రూ.178 కోట్లతో ఏర్పాటు కానున్న అమృత్ పైప్‌లైన్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనాథ్‌రెడ్డిని మంత్రి ఆదేశించారు.

టౌన్‌షిప్‌లను వేగవంతం చేయాలి

అనంతపురం – హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) పరిధిలో జగనన్న టౌన్‌షిప్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్‌లను మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. ప్రారంభం కాని 4 లేఅవుట్లను మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, ఈఈ రామమోహన్‌రెడ్డి, డీఈలు రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరుతున్న వేరుశనగ

- 15 నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు



విత్తన వేరుశనగ బస్తాల లోడు

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా ప్రాసెసింగ్ ప్లాంట్లలో శుద్ధి (ప్రాసెసింగ్) చేసిన విత్తన వేరుశనగను ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్ (టీఎల్ సీడ్) కింద 30 కిలోల చొప్పున ప్యాకింగ్, ట్యాగింగ్ చేసి ఆర్‌బీకేలకు పంపుతున్నారు. అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు, గార్లదిన్నె, కూడేరు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం తదితర మండలాల్లో ఉన్న ఆర్‌బీకేలకు ఇప్పటికే 1,800 క్వింటాళ్లు చేర్చినట్లు ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి. ఈ నెల 15 నుంచి రిజిస్ట్రేషన్లు మొదలు కానుండంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 451 ఆర్‌బీకేలకు అవసరం మేరకు నిల్వ చేయనున్నారు.

కేటాయింపులు ఇలా..

జిల్లాకు కే-6 రకం 76,945 క్వింటాళ్లు, 1812 రకం 1,300 క్వింటాళ్లు... మొత్తంగా 78,245 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. అందులో అత్యధికంగా కళ్యాణదుర్గం వ్యవసాయ సబ్‌డివిజన్‌కు 22,500 క్వింటాళ్లు, అనంతపురం డివిజన్‌కు 16,450 క్వింటాళ్లు, రాయదుర్గం డివిజన్‌కు 16,300 క్వింటాళ్లు, ఉరవకొండ డివిజన్‌కు 9,100 క్వింటాళ్లు, గుత్తి డివిజన్‌కు 8,450 క్వింటాళ్లు, తాడిపత్రి డివిజన్‌కు 4,020 క్వింటాళ్లు కేటాయించారు. బఫర్ కింద 1,425 క్వింటాళ్లు ఇచ్చారు.

- మండలాల విషయానికి వస్తే బ్రహ్మసముద్రం, కుందుర్పి, కళ్యాణదుర్గం, కూడేరు, గుత్తి, గుంతకల్లు, గుమ్మఘట్ట, కణేకల్లు, రాయదుర్గం మండలాలకు అధికంగా కేటాయించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ ప్రకటించడంతో కే-6 రకం రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద 30 కిలోల బస్తాకు రూ.1,674 ప్రకారం, అలాగే 1812 రకం రాయితీ పోనూరైతులు తమ వాటా కింద 30 కిలోల బస్తాకు రూ.1,494 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా కేంద్రం, గుత్తి, లోలూరు, బెళుగుప్పలో ఉన్న ప్రాసెసింగ్‌ప్లాంట్లలో విత్తన శుద్ధి వేగవంతం చేసినట్లు వ్యవసాయ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి


విద్యార్థిని నవ్యకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఎం.గౌతమి బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు సూచించారు. పదో తరగతి పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన 22 మంది విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకుని పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, జిల్లాకు కీర్తి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ ఇచ్చి భవిష్యత్తులో మంచిస్థాయికి చేరుకునేలా సహకరించాలని బీసీ సంక్షేమ అధికారి ఖుష్బూ కొఠారిని ఆదేశించారు.

భార్య, కుమారుడిపై దాడి


గాయపడిన తల్లీ కుమారుడు లక్ష్మీదేవి, కార్తీక్

యాడికి: భార్య, కుమారునిపై ఓ వ్యక్తి, అతనితో సహజీవనం చేస్తున్న మహిళ, మరికొందరు కలిసి కళ్లలో కారం చల్లి కట్టెలు, పైపులతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన శుక్రవారం యాడికిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... యాడికిలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన లక్ష్మీదేవి, లక్ష్మీనారాయణ దంపతులకు కార్తీక్ అనే కుమారుడు ఉన్నాడు. గత కొద్ది సంవత్సరాలుగా లక్ష్మీనారాయణ.... భార్య, కుమారుడిని కాదని మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. దీనిపై కుటుంబ సభ్యుల మధ్య పలుసార్లు గొడవలు జరిగాయి. శుక్రవారం ఇంటివద్ద ఉన్న లక్ష్మీదేవి, కార్తీక్‌పై లక్ష్మీనారాయణ, పెద్దరాజు, జయమ్మ, లక్ష్మీదేవి, పార్వతీ కలిసి కళ్లలో కారంచల్లి దాడి చేశారు. లక్ష్మీదేవి, కార్తీక్‌ల ఫిర్యాదుల మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

చిన్నారి మురిసేలా చికిత్స


ఇక్కడ కన్పిస్తున్న మూడేళ్ల చిన్నారి పేరు ధరణి. సొంతూరు నార్పల మండలం నడిమిదొడ్డి. తీవ్ర ఆయాసం, జ్వరంతో గత నెల 25న నగరంలోని రైల్వే ఫీడర్ రోడ్డు వద్ద ఉన్న ఓ చిన్నపిల్లల ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బెంగళూరు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. రూ.లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో ధరణి తండ్రి ఎర్రిస్వామి అదే రోజున సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చేర్పించారు. ధరణికి వివిధ రకాల పరీక్షలు చేసి ఊపిరితిత్తుల పొరల్లో చీము ఉన్నట్లు గుర్తించారు. 10 రోజులు పాటు పీఐసీయూలో ప్రత్యేక వైద్యం అందించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యులకు రుణపడి ఉంటామని ఎర్రిస్వామి చెబుతున్నారు.


ఈ మహిళ పేరు జయలక్ష్మి. సొంతూరు మిడుతూరు. గత నెల చివరి వారంలో ఆమె కుమారుడు ఐదేళ్ల వయసున్న ఆదిత్యకు జ్వరం రావడంతో పామిడి ఆస్పత్రిలో చూపించారు. ఆదిత్యకు ఫిట్స్ రావడంతో సాయినగర్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు బోలెడు డబ్బు ఖర్చు అవుతుందని, గ్యారెంటీ ఇవ్వలేమని చెప్పారు. దీంతో జయలక్ష్మి చిన్నపిల్లల వార్డులో చేర్పించింది. ఎన్‌సఫలైటిస్‌గా వైద్యులు గుర్తించి పీఐసీయూలో వైద్యం అందించారు. ప్రస్తుతం ఆదిత్య ఆరోగ్యం నిలకడగా ఉందని దేవుళ్లలా వైద్యులు సేవలందించారని జయలక్ష్మి చెబుతున్నారు.


చిన్నపిల్లల వార్డులో కనువిందు చేస్తున్న బొమ్మలు

- రూ.లక్షలు ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం
- జీజీహెచ్‌లోని చిన్నపిల్లల వార్డులో ఉత్తమ సేవలు
- చిన్నారుల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు, స్టాఫ్‌నర్సులు
- అత్యాధునిక సదుపాయాలు, కార్పొరేట్ హంగులతో వార్డు

అనంతపురం క్రైం: వైద్య రంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు, వైద్యులు, సిబ్బంది అంకితభావం వల్ల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు కార్పొరేట్‌స్థాయి వైద్యం అందుతోంది. ఆ విభాగంలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు రౌండ్ ద క్లాక్ అందిస్తున్న సేవలతో చిన్నారుల ఊపిరి నిలుస్తోంది.

నభూతో నభవిష్యత్

చిన్నపిల్లల వార్డులో పీడియాట్రిక్ ఇన్‌టెన్సివ్ కేర్ (పీఐసీయూ), స్టెప్‌డౌన్, హై డిపెండెన్సీ, రెండు యూనిట్లలో చిన్నారులు, నవజాత శిశు కేంద్రం, డీఈఐసీ, న్యూట్రీషియన్ రీహాబిలిటేషన్ సెంటర్‌లోని పసికందులు, పిల్లలకు హెచ్‌ఓడీ డాక్టర్ సుహాసినీ పర్యవేక్షణలో ముగ్గురు అసోసియేట్, ఏడు మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్, నలుగురు పీజీలు, స్టాఫ్‌నర్సులు అందిస్తున్న సేవలు, చిన్నారులు ఆహ్లాదంగా ఆడుకునేందుకు ప్రత్యేక ఆట గది, గోడలకు వేసిన బొమ్మల ఫొటోలు, నిత్యం అందుబాటులో ఉండే స్టాఫ్ నర్సు, వైద్యసిబ్బంది సేవలను పరిశీలిస్తే ఎవరైనా నభూతో నభవిష్యత్ అనాల్సిందే.

జీజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు ఏర్పాటైంది	2000 సంవత్సరం
అప్పట్లో పడకల సామర్థ్యం	30
ప్రస్తుతం పడకలు	60

అందుబాటులో మరో 100 నుంచి 130 పడకలు	
2011లో ఓపీ (ఏడాదికి)	35,604
గతేడాది ఓపీ	38,971
2011లో ఇన్‌పేషంట్లు	4,494
2022లో ఇన్‌పేషంట్లు	14,311

ఇతర జిల్లాల నుంచి కూడా...

వార్డులో 17 వెంటిలేటర్లు, మల్టీపారా మానిటర్స్, హై ఫ్లో నావిల్ క్యాన్యులా, ఖరీదైన మందులు, ఏసీలు, అత్యాధునిక సదుపాయాలు, కార్పొరేట్ హంగులతో చిన్నపిల్లల వార్డును ప్రభుత్వం తీర్చిదిద్దింది. సాధారణ జ్వరం, దగ్గుతో మొదలుకొని పాయిజన్, పాము, తేలు కాట్లు, సీజర్స్(వాయి), బ్రాంకో నిమోనియా, ఎన్‌సఫలైటీస్, తలసేమియా, జీఈ తదితర కేసులకు ఇక్కడ అత్యాధునిక వైద్యం అందుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప, కర్నూలు ప్రాంత వాసులు ఇక్కడే సేవలుపొందుతున్నారంటే వైద్యం ఏ స్థాయిలో అందుతోందో అర్థం చేసుకోవచ్చు.

సమష్టి కృషితో ఉత్తమ సేవలు


వార్డులో స్టాఫ్‌నర్సుల నుంచి పీజీ, ట్యూటర్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు సమష్టిగా చిన్నారులకు నిబద్ధతతో ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతో చిన్నారులకు కార్పొరేట్‌స్థాయి సేవలందిస్తున్నాం. చిన్నారులు జబ్బుతో వస్తే నయమైపోతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పిస్తున్నాం. మరోసారి సమస్య తలెత్తకుండా ఫాలోఅప్ ట్రీట్‌మెంట్, పౌష్టికాహారం ఏవిధంగా తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం.

– సుహాసిని, హెచ్ఓడీ, చిన్నపిల్లల విభాగం, జీజీహెచ్

ఏడాదిలో వేలాది మందికి వైద్యం

2000లో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 30 పడకలతో చిన్నపిల్లల వార్డు ఏర్పడింది. 2010లో మరో 30 పడకలు ఏర్పాటు చేశారు. 2011 సంవత్సరంలో ఇన్ పేషంట్లు 4494 మంది ఉంటే, గతేడాది (2022)లో 14,311 మంది నమోదయ్యారు. 2011తో పోల్చితే మూడింతలుగా చిన్నారులకు వైద్యం అందుతోంది. సీజనల్ రోజుల్లో ఓపీ 150 నుంచి 200, ఐపీ రోజూ 50 నుంచి 60 వరకు ఉంటుంది. ప్రస్తుతం రెండు యూనిట్లలో కేవలం 60 పడకలు మంజూరైనా...150 నుంచి 200 మంది చిన్నారులకు సేవలందుతున్నాయి.

పది గొర్రెల మృతి


రాయదుర్గంటౌన్: విద్యుదాఘాతానికి పది గొర్రెలు మృత్యువాత పడిన ఘటన రాయదుర్గం పట్టణంలోని వాల్మీకినగర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధిత యజమాని తిప్పేస్వామి వివరాల మేరకు... కూలీ పనులతో పాటు జీవనోపాధి కోసం 60 దాకా గొర్రెలు, మేకలు పెంచుకుంటున్నట్లు తెలిపారు. గొర్రెల పెంపకం కోసం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశామన్నారు. అయితే శుక్రవారం ఉదయం కంచెకు విద్యుత్ సరఫరా కావడంతో తాకిన పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు వాపోయారు. దాదాపు రూ.2 లక్షల దాకా నష్టం వచ్చిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇ-డివిజనల్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇ-డివిజనల్ మేనేజర్ (కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికి) పోస్టును కొత్తగా ఏర్పాటైన గుంతకల్ రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయానికి మంజూరు చేసిందని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఓసీ (మహిళ) కేటగిరీ కింద ఈ పోస్టు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 15 నుంచి ఈనెల 31లోపు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం, అర్హతలు, ప్రభుత్వ ఉత్తర్వులను జిల్లా అధికారిక వెబ్ పోర్టల్ http:/ ananthapuramu.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు ధ్రువీకరించిన నకలు పత్రాలను కలెక్టర్ కార్యాలయంలో నేరుగా లేదా రిజిస్ట్రర్ పోస్టు ద్వారానైనా పంపవచ్చన్నారు.

జైలును తనిఖీ చేసిన డీఐజీ


జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు

గుత్తి: గుత్తి స్పెషల్ జైలును శుక్రవారం కడప రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ రాజేశ్వర రావు తనిఖీ చేశారు. ముందుగా డీఐజీకి జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు స్వాగతం పలికారు. డీఐజీ జైలులోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఖైదీల బ్యారెక్‌లను, మౌలిక వసతులతో పాటు రికార్డులను తనిఖీ చేశారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కళ్యాణ్

తాడిపత్రి: విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లి వద్ద ఉన్న బంజారా పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. బాలుడి తల్లి నాగేంద్రమ్మ వివరాల మేరకు... అయ్యవారిపల్లి తండాకు చెందిన నాగేంద్రమ్మ భర్త కంబగిరి స్వామి గతంలోనే మరణించాడు. వీరికి కళ్యాణ్ (13) ఉన్నాడు. సమీపంలో ఉన్న బంజారా పరిశ్రమ సమీపంలో స్క్రాప్ ఏరుకునేందుకు వెళ్లిన కళ్యాణ్ ప్రమాదవశాత్తూ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు. విద్యుత్ తీగలు చిన్న బాలుడికి తగిలే ఎత్తులో వేలాడుతున్నాయంటే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఎంతలా ఉందో ఆలోచించండంటూ తల్లి నాగేంద్రమ్మ వాపోయింది. లైన్‌మెన్ నిర్లక్ష్యం మూలంగానే బాలుడికి ఈ పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జరిగిన ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

నర్సులు దేవతలతో సమానం


ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

అనంతపురం క్రైం: ఆస్పత్రుల్లో అడ్మిషన్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య సేవలందిస్తున్న నర్సులు దేవతలతో సమానమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కొనియాడారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఎస్పీ శ్రీనివాసరావులతో కలసి కేక్ కట్ చేశారు. నర్సింగ్ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సులే స్వయంగా తమ కష్టార్జితంతో ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. నర్సులు ఎలా ఉండాలి? ఎలా సేవలందించాలని చాటిచెప్పిన మహోన్నతురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ అని, ఆమె స్ఫూర్తితో మరింత బాధ్యతగా రోగులకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ రఘునందన్, ప్రిన్సిపాల్ శ్రీదేవి, డీఐఓ యుగంధర్, ఆర్ఎంఓ వైవీ రావు, సూపర్ స్పెషాలిటీ ఇన్‌చార్జ్ సుబ్రమణ్యం, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, స్టాఫ్‌నర్సు అసోసియేషన్ చాముండేశ్వరి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పనులకు ఆటంకం కలగకూడదు

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద జరుగుతున్న పనులకు ఆటంకం కలగకూడదని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్, డీఈఓ సాయిరామ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం 'నాడు-నేడు' పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈఓలు, వెలుగు ఏపీఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వెబ్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీపీసీ మాట్లాడుతూ పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్ఎంలు సెలవు దినాల్లోనూ అందుబాటులో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. సెంట్రల్ పొక్యూర్‌మెంట్ మెటీరియల్, సిమెంట్, ఇసుక వచ్చిన వెంటనే చెక్ చేసుకుని ఇన్‌వాయిస్‌లను అప్‌లోడ్ చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాలకు వచ్చిన వస్తువులను తిరస్కరించకూడదన్నారు.

పెళ్లింట విషాదం

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


ముక్తియార్ (ఫైల్)

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనం అదుపుతప్పటంతో ఓ బాలుడు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన బొమ్మనహాళ్ మండలం కల్లుహోళ గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఉద్దేహాళ్‌కు చెందిన వలిబాషా, ఫాతిమా దంపతులకు ముక్తియార్ (15) అనే కుమారుడు ఉన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉంటే ముక్తియార్ మేనమామ పెళ్లి 14న జరగనుండటంతో బంధువులంతా ఇప్పటికే కల్లుహోళ గ్రామానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారుజామున మండలంలోని కల్లుహోళకు ముక్తియార్ తన స్నేహితుడు సుఫీయాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. అయితే కల్లుహోళ గ్రామ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. ముక్తియార్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. సుఫీయాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి వలిబాషా చికెన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ముక్తియార్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురావడంతో కుటుంబ సభ్యులు , బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

ప్రేమ పేరుతో వివాహిత వేధింపులు

- ఆత్మహత్య చేసుకున్న యువకుడు


ఆత్మహత్య చేసుకున్న పృథ్వీ

రాయదుర్గంటౌన్: ప్రేమ పేరుతో వివాహేతర సంబంధంలో చిక్కుకుని చివరకు ప్రియురాలి వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయదుర్గం పట్టణంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న పృథ్వీ (35) గోబీమంచూరియా విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. పృథ్వీకి భార్య లలిత, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై భార్య లలిత, తండ్రి కిష్టప్ప మాట్లాడుతూ పృథ్వీని ప్రేమ పేరుతో ఓ వివాహిత తరుచూ వేధింపులకు గురిచేసేదని తెలిపారు. బ్లాక్ మెయిల్ చేస్తుండటంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గస్తీ ముమ్మరం చేయండి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐజీ

ధర్మవరం రూరల్: చోరీలు, నేరాల నియంత్రణకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, విలేజ్ రోస్టర్ తదితర వాటిపై ఆరా తీశారు. వేసవిలో చోరీలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, తగు చర్యలు తీసుకుని నివారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు. డీఐజీ వెంట ధర్మవరం డీఎస్పీ టి. శ్రీనివాసులు, రూరల్ సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ శ్రీ హర్ష, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

బెళుగుప్ప: మండల పరిధిలోని జీడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ తోటల వద్ద ఖాళీ ప్రదేశంలో క్రికెట్ ఆడుతుండగా ఉన్న ఫలంగా తేనెటీగలు విరుచుకుపడ్డాయి. వాణి (3వ తరగతి), సందీప్‌రెడ్డి (6వ తరగతి), అరవింద్ (8వ తరగతి), కిరణ్ (ఇంటర్ ఫస్ట్ ఇయర్) గాయపడగా... మిగతావారు సమీపంలోని వాగులోకి పరుగెత్తి నీటిలో మునుగుతూ తేనెటీగల దాడి నుంచి తప్పించుకున్నారు. అటుగా పశువులను మేపుకుంటున్న ఆవుల నాగరాజు, ధనుంజయలపై కూడా దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన విద్యార్థులను ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి, నాగరాజు, ధనుంజలను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మొత్తం 3 అంగన్‌వాడీ పోస్టులకు 17 దరఖాస్తులు, 25 హెల్పర్ పోస్టులకు 41 దరఖాస్తులు, ఒక మినీ అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులేమీ రాలేదని అధికారులు వెల్లడించారు. త్వరలో ఇంటర్వ్యూ తేదీ వెల్లడిస్తామని వివరించారు.

ఆస్తి కోసం కన్న తండ్రిపై దాడి


చెన్న మల్లప్ప (ఫైల్)

బ్రహ్మసముద్రం: ఆస్తి కోసం కన్న తండ్రిపై కుమారుడు కత్తితో దాడిచేసిన సంఘటన బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లిలో బుధవారం రాత్రి జరిగింది. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు గుడిపల్లికి చెందిన బోయ చెన్నమల్లప్పకు తిప్పేస్వామి, వెంకటేశులు కుమారులు. వీరికి పెళ్ళిళ్లు చేసి తనకు ఉన్న భూమిని చెరో 6 ఎకరాలు చొప్పున ఇద్దరికీ 12 ఎకరాలు పంచి ఇచ్చారు. అయితే.. చెన్న మల్లప్ప పెద్దకుమారుడు తిప్పేస్వామి తనకు భూమి సరిగా పంచలేదని తనకు అనువైన భూమిని ఇవ్వలేదని, జేష్టభాగం తనకు పంచి ఇవ్వాలని తరచూ తండ్రితో గొడవ పడుతుండే వాడు. ఈ నేపథ్యంలో బుధవారం తిప్పేస్వామి తన తండ్రి చెన్న మల్లప్ప , తమ్ముడు వెంకటేశులుతో గొడవ పడి కత్తితో తన తండ్రి చెన్నమల్లప్పపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన చెన్నమల్లప్పను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మల్లప్ప (70) మృతి చెందారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతుడు ఆంజినేయులు

డీ హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని మురడి- హనుమాపురం గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమాపురంకు చెందిన ఆంజినేయులు (20) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రంగడుయాదవ్ వివరాల మేరకు.. ఆంజినేయులు మిత్రుడు విజయ్‌కుమార్‌తో కలసి మురడి నుంచి హనుమాపురంకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కృష్ణారెడ్డి అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎదురుగా రావడంతో పరస్పరం ఢీ కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ఆంజినేయులు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు.

సిద్దరాచర్ల సర్పంచుపై దాడి

నార్పల: మండల పరిధిలోని సిద్దరాచర్ల గ్రామానికి చెందిన దళిత సర్పంచు సాకే రామాంజినేయులుపై జనసేన కార్యకర్త వినోద్‌కుమార్ శుక్రవారం దాడి చేశారు. వివరాల్లోకెళితే... దుర్గం గ్రామానికి చెందిన రత్నమ్మ అనే మహిళ తన ఇంటి ముందు మెట్లను రోడ్డుపై నిర్మిస్తుండటంతో సర్పంచు రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డితో కలసి వెళ్లి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించవద్దని సూచించారు. రోడ్డు పక్కన కాలువ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే రత్నమ్మ వారి మాటలు లెక్క చేయకుండా రోడ్డును ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. ఇదిలా ఉంటే శుక్రవారం రామాంజినేయులు తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా రత్నమ్మ ఆయన వాహనానికి అడ్డు వచ్చి తన కుమారుడు జనసేన కార్యకర్త వినోద్ కుమార్ సాయంతో హెల్మెట్‌తో దాడి చేశారు. స్థానికులు గాయపడిన రామాంజినేయులను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దళిత సర్పంచుపై దాడి చేయడం సరికాదని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలో నూతనంగా నిర్మించనున్న శ్రీలక్ష్మీవెంకటరమణస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

హజ్ యాత్రికులకు రేపు శిక్షణ

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం నుంచి హజ్ యాత్రకు బయల్దేరి వెళ్లనున్న యాత్రికుల (స్త్రీలు, పురుషులు)కు ఆదివారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఖాదీమ్ మహమ్మద్ రఫీ శుక్రవారం తెలిపారు. అనంతపురం ప్రశాంతినగర్‌లోని హాజీ హష్మత్ అలీ నివాస గృహంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హజ్ విధి విధానాలు తెలిపే పుస్తకాలు కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 95504 01761/98857 17263/94409 98309లో సంప్రదించాలన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల సభ్యులు

అనంతపురం అర్బన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని ఐద్వా, మహిళా సమాఖ్య, స్త్రీవిముక్తి సంఘాల నాయకురాళ్లు స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సావిత్రి, పద్మావతి మాట్లాడారు. బీజేపీ అధికారంలోకొచ్చిన తర్వాత మహిళలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని అన్నారు. బాధ్యతాయుతమైన ఎంపీ స్థానంలో ఉండీ మహిళల రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం హేయమన్నారు. సంఘాల నాయకురాళ్లు పార్వతీప్రసాద్, రామాంజనమ్మ, నాగమేణి, యశోదమ్మ, నళిని, పుష్ప పాల్గొన్నారు.

సంస్కారం నేర్పే భాష సంస్కృతం

అనంతపురం కల్చరల్: సంస్కారం నేర్పే సంస్కృత భాషను ఈతరంవారు నేర్చుకోవాలని ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ నాగత్రిశూలపాణి అన్నారు. నగరంలోని అశోక్‌నగర్ సరస్వతి శిశుమందిరంలో సంస్కృత భారతి ఆధ్వర్యంలో 'సంస్కృత భాషా సంభాషణం' అనే అంశంపై వేసవి శిక్షణ శిబిరం జరిగింది. పదిరోజుల పాటు జరిగే శిబిరాన్ని సంస్కృత భారతి అధ్యక్షురాలు నాగత్రిశూలపాణి, కార్యదర్శి కేకేవీ శర్మ, సహ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి తదితరులు సంస్కృత భాష గొప్పతనాన్ని వివరించారు.

ముగిసిన శిక్షణ శిబిరం



శిక్షణకు హాజరైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ పి.సాయికృష్ణ

అనంతపురం: నేషనల్ క్రికెట్ అకాడమీ అండర్-16 శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ఏప్రిల్ 16 నుంచి మే 11 వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌ల్లో నైపుణ్యత పెంపొందించేలా శిక్షణ కల్పించారు. ముగింపు కార్యక్రమానికి ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ పి.సాయి కృష్ణ, ఆర్డీటీ హెడ్ కోచ్ రాకేష్ ధ్రువ్, ఏడీసీఏ సెక్రటరీ కే మధు ఆచారి, తదితరులు క్రీడాకారులను అభినందించారు.

నాగ ప్రతిష్టలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: నగరంలోని త్త్రాత్రేయ మందిరంలో గోపూజలతో నాగ ప్రతిష్ట కార్యక్రమాలను శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే వేడుకల్లో తొలిరోజు నిర్వాహకులు అప్పా సుధీర్ నేతృత్వంలో గణపతి, గోపూజలు, కలశస్థాపన, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి దేవి చరప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం రాత్రి జరిగాయి.

మెలకువలు నేర్చుకోవాలి

కనగానపల్లి: గణిత శాస్త్రంలో పట్టుసాధించాలంటే విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలని ఉపాధ్యాయుడు నాగముని తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వేదిక్ గణితంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి గోవిందు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే 'అనంత వెంకటరామిరెడ్డి'తో లబ్ధిదారులు

అనంతపురం క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఇళ్ల ముంగిటకే సేవలు అందిస్తున్నారని, ఆయన సేవలను మరువలేమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ప్రజలు ఆనందంగా చెప్పారు. శుక్రవారం నగరంలోని 6వ డివిజన్‌లోని వేణుగోపాల్ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ సుజాత, సచివాలయ కన్వీనర్లు రమాదేవి, సుబ్బారెడ్డితో కలసి ఆయన ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును తెలియజేశారు. ఈబీసీ నేస్తం, పెన్షన్ ద్వారా వస్తున్న డబ్బును సద్వినియోగం చేసుకొన్నట్లు దామోదర్ అనే వ్యక్తి ఎమ్మెల్యేతో తెలిపారు. టిడ్కో ఇంటి కోసం రూ.50 వేలు చెల్లించామని శ్యాంసుందర్ అనే వ్యక్తి ఎమ్మెల్యేకి విన్నవించారు. ఇంటి స్థలాన్ని మంజూరు చేయడం సంతోషంగా ఉందని భారతి అనే మహిళ తెలిపింది. వసతి దీవెన, విద్యా దీవెన ద్వారా తమ బిడ్డ భవిష్యత్తుకు ఉపయోగపడుతోందని రాధ అనే మహిళ తెలిపింది. సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు సీఎం కావాలని చంద్రమ్మ అనే మహిళ ఎమ్మెల్యేతో తెలిపింది.

అభాగ్యులకు ఎమ్మెల్యే అభయం:
అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న నాగమ్మ అనే మహిళ సమస్యను ఎమ్మెల్యేకి విన్నవించగా, ఇంట్లో ఒకరికి వలంటీర్‌గా అవకాశమిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల మరణించిన పూలవ్యాపారి లక్ష్మీ కూతురు ప్రణతి (ఐదో తరగతి)ని గురుకుల పాఠశాలలోగానీ, స్వచ్ఛంద సంస్థ పాఠశాలలోగానీ చదివిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు గౌస్‌బేగ్, గోవిందు,



సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

జాహ్నవి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు శ్రీదేవి, కొర్రపాడు హుస్సేన్ పీరా, కార్పొరేటర్లు జయలలిత, రాజేశ్వరి, సైఫుల్లాబేగ్, సంపంగి రామాంజనేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శతవారం..'భజన'ం భవతి

అనంతపురం కల్చరల్: శ్రీనివాస గోవింద..శ్రీవేంకటేశా గోవింద.. అంటూ భక్తుల పారవశ్యంతో సాగిన ఇంటింటా సామూహిక గోవింద భజనలు వందవారాలు పూర్తయ్యాయి. ప్రతి శనివారం శ్రీ గోవింద భజన మండలి ఆధ్వర్యంలో భక్తుల ఇంటనే సామూహిక భజనలు నిర్వహిస్తున్నారు. వందో కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి ఆదినారాయణరెడ్డి ఇంట్లో విశేష పూజలతో ప్రారంభించారు. శ్రీనివాసుడి ఆలయానికి వెళ్లనవసరం లేకుండా శ్రీ వాసవీ గోవింద భజన మండలి సభ్యుడు ఆళ్లగడ్డ రాము 'ఇంటింటా గోవిందుడి భజనలు' పేరుతో ప్రతి శనివారం ఒక భక్తుడి ఇంట్లో శ్రీవారి సామూహిక భజనలు చేయిస్తున్నారు. 2019 ఏప్రిల్ 27న ముగ్గురు సభ్యులతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభమైంది. ప్రస్తుతం నిర్వాహకుల సంఖ్య 51కి చేరుకుంది. కరోనా కాలంలో కాస్త విరామం ఇచ్చినా.. భక్తుల కోరిక మేరకు మళ్లీ కొనసాగిస్తున్నారు. కోరుకున్న భక్తుడి ఇంట తెల్లవారుజామునే నిలువెత్తు శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకెళ్లి, సొంత ఖర్చులతో వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, భజన సామగ్రి, తీర్థప్రసాదాలు మండలి ఆధ్వర్యంలో అందజేస్తారు. భజన పూర్తయిన తర్వాత తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీవారి ప్రతిమ ఇంటి యజమానికి అందిస్తారు. ప్రతి శనివారం సామూహిక భజనల్లో హుండీ ద్వారా వచ్చిన కానుకలను సైతం ప్రతి వారం ఇస్కాన్ గోశాలకు ఇస్తారు.



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న భజన మండలి సభ్యులు

హనుమద్ జయంతి వేడుకలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: హనుమద్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ఉదయం పరుచూరు రమేష్ నేతృత్వంలో ధర్మధ్వజాన్ని ప్రతిష్ఠించి, వేడుకలు ప్రారంభించారు. అనంతరం 12 గంటల పాటు సాగే అఖండ రామనామస్మరణ శనివారం ఉదయం వరకు నిర్విరామంగా సాగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు పరుచూరు రమేష్ తెలిపారు. ఈనెల 14న పెద్ద ఎత్తున హనుమద్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కోర్టు రోడ్డు వరదాంజనేయస్వామి ఆలయం, పాతూరు మండీ ఆంజనేయస్వామి దేవస్థానం, మారుతీనగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఈనెల 14న జరిగే హనుమద్ జయంతి వేడుకలను స్థానిక పంచాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు టీటీడీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పండిట్ వేణు, కార్యక్రమ సహాయకుడు బాబు తెలిపారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకాలు, తమలపాకులపూజ, సుందర కాండ పారాయణం, సామూహిక హనుమద్ చాలీసా పఠనం ఉంటాయని భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు.

విధులపై అలసత్వం వహిస్తే చర్యలు

చెన్నేకొత్తపల్లి: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ శివారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఓబుళంపల్లి, వెంకటంపల్లి సచివాలయంతో పాటు ఆమిదాలకుంట, నాగిశెట్టిపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓబుళంపల్లి గ్రామ సచివాలయంలో విధులకు అలస్యంగా వచ్చిన సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్ పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం చేద్దాం

- అగ్రిబోర్డు మీటింగ్‌లో ఏఓ వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ సాగుకు రైతులను సమాయత్తం చేద్దామని రూరల్ మండల ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక కృషి భవన్‌లో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ జూన్ నుంచి కొత్త సీజన్ ప్రారంభమవుతోందన్నారు. ఇప్పటికే విస్తారంగా వర్షాలు కురిశాయని, మరోవైపు విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభమైనందున వేసవి దుక్కులు, పంటలు సాగు చేసుకునేలా రైతుల్లో చైతన్యం తీసుకువద్దామన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో పంటల ప్రణాళిక తయారు చేసి, అవసరమైన విత్తనం రాయితీతో అందజేస్తామన్నారు. మండలానికి 3 వేల క్వింటాళ్ల కే-6, వంద క్వింటాళ్ల 1812 రకం విత్తన వేరుశనగ కేటాయించినట్లు తెలిపారు.



అగ్రిబోర్డు మీటింగ్‌లో మాట్లాడుతున్న రూరల్ ఏఓ వెంకటేశ్వరప్రసాద్

అందులో కొన్ని ఆర్‌బీకేలకు విత్తనకాయలు చేరినట్లు తెలిపారు. వేరుశనగ, జనుము, జీలుగ లాంటి పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో ఇస్తున్నారన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో ఈనెల 15 నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో అగ్రిబోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, హెచ్‌ఓ చందన, ఏఈవోలు మురళి, ప్రసాద్, శిరీష, ఆర్‌బీకే అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

నిరంతర వైద్యవిద్యతో సంస్కరణలు

- పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి

అనంతపురం క్రైం: నిరంతర వైద్య విద్యతో నూతన సంస్కరణలకు ఆస్కారం ఉంటుందని పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ హాజరయ్యారు. మొదటగా జ్యోతి ప్రజ్వల చేశారు. పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో అనలైటిక్ టాక్సికాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా పాయిజన్ తీసుకున్న వారికి సకాలంలో పరీక్షలు చేసి, వారి ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందన్నారు. ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్‌నాయక్, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ జొన్న ఉదయభాస్కర్ వర్చువల్ ఆటోప్సి (విట్రాప్సి) ద్వారా మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండానే సిటీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ తదితర స్కాన్ల ద్వారా నివేదికను సమర్పించొచ్చన్నారు. అనంతరం ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ విజయరాఘవేంద్ర, డాక్టర్ రమేష్ బాబు, గాలేటి చంద్రశేఖర్, ఆర్ఎఫ్ఎస్ఎల్ సైంటిఫిక్ ఆఫీసర్ రాజారంగనాథ రెడ్డి తదితరులు వివిధ అంశాలపై సీఎంఈలో మాట్లాడారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రాప్తాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో చిత్ర లేఖనం, కథలు చెప్పించారు. రాప్తాడులో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమాదేవి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ఇంకా 40 రోజుల పాటు జరుగుతాయన్నారు. గ్రంథాలయాలను, ప్రజలు, విద్యార్థులు నిరుద్యోగులు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.వీరానారాయణ రెడ్డి, సహాయకురాలు ముత్యాలమ్మ, విశ్రాంత టీచర్ ఆదినారాయణ రెడ్డి, మురళీ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



రాప్తాడులో విద్యార్థులతో కథలు చదివిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమాదేవి

మహా యజ్ఞానికి దత్తపీఠాధిపతులకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 17 వరకు జరిగే అష్టోత్తర శత కుండాత్మక మహాయజ్ఞంలో పాల్గొనాలని దత్తపీఠాధిపతులు గణపతి సచ్చిదానంద స్వామిని ఏసీ రామాంజనేయులు ఆహ్వానించారు. ఈ మేరకు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ శుక్రవారం సాయంత్రం మైసూరుకు వెళ్లి స్వామిని రాష్ట్ర ప్రభుత్వం, ఎండోమెంట్ కమిషనర్ తరపున ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వం చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాయజ్ఞ యాగాదులు, వివిధ దేవతామూర్తుల కల్యాణోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ యజ్ఞదీక్షాధారణ చేస్తారన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఈవో బాబు తదితరులు దత్త పీఠాధిపతులను కలిసిన వారిలో ఉన్నారు.



దత్తపీఠాధిపతులను ఆహ్వానిస్తున్న ఎండోమెంట్ అధికారులు

టీడీపీలో దళిత నాయకులకు రక్షణ లేదు

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

అనంతపురం టవర్‌క్లాక్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీడీపీలోని దళిత నాయకులపైనే దాడులు చేయిస్తూ, అధికార పార్టీపై విమర్శలు చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవోహోంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. పేరుపోగు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాదిగల రాజకీయ చైతన్యయాత్ర తో దళితులను ఐక్యం చేస్తున్నామన్నారు. శింగనమల నియోజకవర్గంలో టీడీపీ ద్విసభ్య కమిటీ వేసి, అక్కడ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిని అవమానించారని, బండారు రవికుమార్‌పై ద్విసభ్య కమిటీ సభ్యులు దాడి చేయడం దారుణమన్నారు. దళితులకు అండగా ఉంటామని చెప్పే చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్.. దళితులపై దాడులు ఎలా చేయిస్తున్నారని ప్రశ్నించారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుంటిమద్ది ఓబులేసు, రాచేపల్లి రామాంజనేయులు, జేసి శేఖర్, కుళ్లాయప్ప, ముద్దు నాగరాజు, మద్దిలేటి, ఓబులేసు, రామాంజనేయులు, చిరంజీవి, సుమన్, గంగయ్య, శీన, గంగిశెట్టి పాల్గొన్నారు.

పాతూరులో యువకుడిపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాతూరు కూరగాయల మార్కెట్ వద్ద హమాలీ శివా అనే యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అడ్డుకోవడంతో దాడికి యత్నించిన వ్యక్తులు అక్కడి నుంచి ఉడాయించారు. రక్తపుగాయాలతో కొట్టుమిట్టాడుతున్న శివను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు గాయాలు:
తాడిపత్రికి చెందిన వరలక్ష్మి అనే మహిళ ప్రభుత్వాస్పత్రికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఆటో ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రి వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాప్తాడు: 104లో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం కోరారు. శుక్రవారం మండలంలోని 104 ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు మానస, శ్రీపతి, కిశోర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పొగాకు నియంత్రణకు పాటుపడదామని నాల్గో పట్టణ ఎస్ఐ గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో జాతీయ పొగాకు నియంత్రణపై పోస్టర్‌ను విడుదల చేశారు. చిన్నపిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



చేతన



ఎల్. జాషువా జెఫ్రీ



కే శివాని



ఎం. సంజన రెడ్డి



కే రేవతి

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయంలో సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్. కరీంఖాన్ తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో మొత్తం 37 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ఆరుగురు 91 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారన్నారు. కోట్ల చేతన 579 మార్కులు (96.5 శాతం), ఎల్.జాషువా జెఫ్రెయ్ 557 మార్కులతో 92. 8 శాతం, కే శివాని 561 మార్కులు, సంజనరెడ్డి 557 మార్కులు, కే రేవతి 556 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అభినందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రామగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రామగిరి సర్పంచ్ మీనుగ నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రామగిరి సచివాలయంలో శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, పెనుకొండ ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులరెడ్డి ఆదేశాల మేరకు పర్యావరణ, జీవనశైలిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నరేంద్రశర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శుభకర్

రాప్తాడు: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని ఏఓ శుభకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. అర్హులైన ప్రతి రైతుకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తామన్నారు. ఈనెల 15 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, అగ్రి బోర్డు చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నాయకులు, దివ్యాంగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఓ పెద్దన్న మాట్లాడుతూ దివ్యాంగులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ ఏఓ శ్రీధర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూరప్ప, శివరుద్ర, జయమ్మ, రంగనాథ్, పుల్లయ్య, నాగరాజు, శ్రీనివాసులు, గజేంద్ర, తిప్పేస్వామి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు

ఆత్మకూరు: లింగ నిర్ధారణ పరీక్షలు ఎక్కడా చేయరాదని ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య, తలుపూరు సర్పంచ్ ఓబులేష్ తెలిపారు. శుక్రవారం తలుపూరు గ్రామంలో లింగ నిర్ధారణ చట్టం, ఆవశ్యకతపై తెలియజేశారు. లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ సెక్రటరీ మహబూబ్ జాన్, గర్భిణులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సహకారం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహా రెడ్డి

అనంతపురం: అనంతపురంలోని ప్రశాంతి జిల్లా సమాఖ్యలో శుక్రవారం రాయదుర్గం, తాడిపత్రి క్లస్టర్స్ ఏపీఎం, సీసీఎస్‌లకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధికి సహకారం అందించేలా శిక్షణ ఇచ్చారు. బ్యాంకుల నుంచి రూ.10 లక్షల వరకు ఎలాంటి వ్యక్తిగత పూచీకత్తు లేకుండా రుణాలు ఇప్పించడం, పీఎంజీఈపీ, ముద్ర, స్టాండ్ అప్ ఇండియా , శ్రీనిధి, ఉన్నతి, తదితర పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆశయాన్ని కొనసాగిద్దాం

- నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి



ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ లలిత కుమారి

అనంతపురం క్రైం: ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ నర్సులుగా తీర్చిదిద్దుదామని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1852లో యుద్ధంలో గాయపడిన వారికి ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలందించడమే కాకుండా ఎంతో మంది నర్సులను తయారు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యరాణి, జ్ఞాన ప్రసూన, శాంత కుమారి, నిరుపమ, విజయకుమారి, వెంకటలక్ష్మి, మంజుల, గాయత్రి, హేమలత, షిబారాణి, శోభారాణి, ఆంథోని మేరి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.